క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ



శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా విశేషంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే శిల్పా

వెలుగోడు: పట్టణానికి బళ్లాని వెంకట సత్యనారాయణ కుమార్తె వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి,దేశం తిరుపెం రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఆత్మకూరు: బీసీల సంక్షేమానికి కృషి చేస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు నాగేశ్వరయాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం బీసీ నాయకులతో సమావేశమయ్యారు. వెంకటస్వామిగౌడ్, బాలస్వామియాదవ్, రామకృష్ణ, వెంకటరమణ, పెద్దన్న, రమణ పాల్గొన్నారు.

శ్రీశైలంలో డ్రోన్ కలకలం



నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న సెక్యూరిటీ

శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆలయ సమీపంలో డ్రోన్ చక్కర్లు కొట్టడం కలకలం రేపింది. గమనించిన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది డ్రోన్‌ను ఎవరు ఆపరేట్ చేస్తున్నారు, ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారనే విషయాన్ని కనుగొన్నారు. భవానీ స్నాన ఘట్టాలు సమీపంలో కొందరు యువకులు దేవస్థానం, స్థానిక పోలీసుల అనుమతి లేకుండా అనధికారికంగా వినియోగిస్తున్నారని తెలియడంతో అక్కడికి చేరుకొని వారిని ప్రశ్నించారు. వారి వద్ద ఉన్న డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి



ధ్వంసమైన శ్మశాన వాటిక ప్రహరీని పరిశీలిస్తున్న జైగౌడ సంఘం నాయకులు

నందికొట్కూరు: గౌడ్ కులస్తుల శ్మశాన వాటిక ప్రహరీ గోడ, ముఖ ద్వారం కూల్చివేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని జైగౌడ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జువ్వాజి చంద్రశేఖర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు పిట్ట ఎల్లగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ సమీపంలోని శ్మశాన వాటికను పరిశీలించారు. సర్వే నంబర్ 487–ఏలో 1. 80 ఎకరాల భూమిలో గౌడ్ శ్మశాన వాటికను 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దుండగులపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని కోరారు. శ్మశాన వాటికను కబ్జా చేసేందుకు కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేసినట్లు తెలుస్తోందని చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యం

జూపాడుబంగ్లా: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అంతే ముఖ్యమని.. తల్లిదండ్రులు పిల్లలకు మంచి, చెడులను తెలియజేసి సత్ప్రవర్తనతో పెంచాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరశర్మ అన్నారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

అఘాయిత్యాల నివారణలో ప్రభుత్వం విఫలం

జూపాడుబంగ్లా: రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాల నివారణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని సీపీఎం మండల కన్వీనర్ కర్ణ, సహాయ కన్వీనర్ రాము తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఈనెల 14 తేదీ జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

భక్తులతో మహానంది కిటకిట



వెలిగిపోతున్న మహానంది ఆలయ గోపురాలు,



మహానందిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- కార్తీకదీపాలు వెలిగించి భక్తుల పూజలు
- ఉదయం నుంచి నిర్విరామంగా దర్శనం

మహానంది: కార్తీకమాసం, ఆదివారం కావడంతో మహానంది ఆలయం వేలాది భక్తజనంతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. వేలాది మంది భక్తజనం రాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. భక్తులు ఉచిత, ఆర్జిత సేవాటికెట్లు, రుద్రాభిషేకం, స్పర్శదర్శనం టికెట్ల ద్వారా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. ఆలయంలోని ధ్వజస్తంభం, నందిస్తూపం, నాగులకట్ల, పాండవులు నిర్మించిన పంచలింగాల ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నేడు రెండవ సోమవారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భక్తులరద్దీ మేరకు దేవస్థాన అన్నప్రసాద వితరణ భవనంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఉచిత అన్నప్రసాద వితరణ ఉంటుందని ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



మహానందీశ్వర స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

మహానందికి కార్తీక కాంతులు

కార్తీకమాసం సందర్భంగా మహానంది దేవస్థానంలోని ఆలయ గోపురాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. గర్భాలయ గోపురాలతో పాటు రాజగోపురం, సుపథ మండపాలు, మహాద్వారం, ఆలయ ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్తీకమాసం సందర్భంగా మహానంది ఆలయ గోపురాలకు విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం.

సంగమేశ్వరంలో భక్తుల సందడి



సంగమేశ్వరంలో ఎగువ పుష్కరఘాట్ వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



శివలింగానికి హారతి ఇస్తున్న భక్తులు

కొత్తపల్లి: కార్తీక మాసం సందర్భంగా పవిత్ర పుణ్య క్షేత్రమైన సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్, ఉమా మహేశ్వరాలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ముందుగా పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం లలితా దేవికి, శివలింగాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారిని భారతి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రం సోమశిల నుంచి భక్తులు సంగమేశ్వరం దర్శించాలంటే బోటు నిర్వాహకులకు అధిక మొత్తం చెల్లించుకోక తప్పడం లేదు. ఒక్కో వ్యక్తి నుంచి రూ.300 వసూలు చేస్తూ దోచుకుంటున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రానుపోను రూ.200 వసులు చేసేవారని.. ఇప్పుడు అధికంగా వసులు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

పాములపాడు: ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించేటప్పుడు నిశితంగా పరిశీలించి దరఖాస్తులు స్వీకరించాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి తెలిపారు. ఆదివారం మండలంలోని పాములపాడు, రుద్రవరం పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఓటుహక్కు నమోదు కోసం యువతీ,యువకుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఓటరు తొలగింపు ప్రక్రియపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతనే తొలగించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. అలాగే తహసీల్దార్ సుభద్రమ్మ తుమ్మలూరు, కృష్ణరావుపేట, మిట్టకందాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో ఓటుహక్కు నమోదు కోసం 36 దరఖాస్తులు, తొలగింపు కోసం 6, చేర్పులు, మార్పులకోసం 19 చొప్పున వచ్చినట్లు వెల్లడించారు. మలివిడతగా ఈనెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డీటీ పటాన్‌బాబు, ఆర్ఐ ఖాజాబీ ఉన్నారు.

ఓటరు నమోదుకు 14 దరఖాస్తులు

నందికొట్కూరు: ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 69 పోలింగ్ స్టేషన్‌లో రెండో రోజు ఆదివారం ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓటు నమోదుకు–14 మంది దరఖాస్తు చేసుకోగా, ఫారం –10లో ఒకరు, ఫారం–8లో 17 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు డీటీ కళావతి తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపులు జరుగుతాయని చెప్పారు.



పాములపాడులో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

పోలింగ్ బూత్‌ల తనిఖీ

ఆత్మకూరురూరల్: మండలంలోని కరివేన గ్రామంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ రత్నరాధిక ఆదివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. నిర్ణీత వేళల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఈనెల 23,24వ తేదీల్లో కూడా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బండిఆత్మకూరు: ఆదివారం జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 45 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ ధోని అల్ఫ్రెడ్ తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో కూడా మరోసారి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జూపాడుబంగ్లా: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో చేసిన తప్పులను తెలుసుకుని సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. నేరప్రవృత్తిని వీడకుండా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. పీడీయాక్టు ప్రయోగించి గ్రామ, జిల్లా బహిష్కరణ చేయిస్తామని హెచ్చరించారు. కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని అందరితో మంచిగా మెలగాలని.. ప్రశాంత జీవితం గడపాలన్నారు. సత్ప్రవర్తనతో మెలిగే వారి వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి పేర్లు రౌడీషీటర్ నుంచి తొలగించేందుకు యత్నిస్తామని ఎస్ఐ తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే గ్రామ బహిష్కరణ

పగిడ్యాల: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని..శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే గ్రామ బహిష్కరణ చేస్తామని ముచ్చుమర్రి ఎస్ఐ సి. శరత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచించారు. అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని.. తమకు తెలియకుండా గ్రామం విడిచి వెళ్లరాదన్నారు. ప్రతి కదలికపై నిఘా ఉంటుందని తెలిపారు. చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

మహానంది: ఉచిత దర్శనం క్యూలైన్లలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా మహానంది ఆలయానికి భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉచిత దర్శనానికి ఉత్తర ద్వారం ద్వారా వెళ్లే భక్తులకు అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈవో మాట్లాడుతూ క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సేపు ఉండకుండా వెంట వెంటనే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వసతి గృహాల నిర్మాణాల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం సిబ్బంది కోసం సున్నిపెంటలో నిర్మిస్తున్న వసతి గృహాల నిర్మాణ పనులను దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఈ ఇ.చంద్రశేఖరరెడ్డి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. మొత్తం మూడు బ్లాక్‌లలో 297 గృహాలు నిర్మిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వసతి గృహాలకు మంచినీటి సరఫరాలో భాగంగా నీటిపంపుల పనులు వేగవంతం చేయాలని, అవసరమైన మోటార్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి హెచ్.టి.యార్డు పనులను ప్రారంభించాలని ఆదేశించారు. వసతిగృహాల వద్ద సీసీరోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులను చేపట్టాలన్నారు. ఫిబ్రవరిలోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, డీఈఈ చంద్రశేఖర శాస్త్రి, సుబ్బారెడ్డి, ఏఈ ప్రణయ్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఆత్మకూరు: హిందూ ధర్మ పరిరక్షణ కోసం విజయవాడలో 2025 జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను హిందూ ధర్మ రక్షణ ధార్మిక సంఘాలు, హైందవులు పాల్గొని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మినారాయణ, శేషసాయి, అపర్ణ దీపిక పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగిన ఆత్మకూరు ఖండస్థాయి హైందవ శంఖారావం సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గరుడాద్రి సుదర్శన్, వాసుదేవరెడ్డి, శ్రీధర్‌గుప్తా, భానుమూర్తి, ఆవులరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

వెలుగోడు: దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి ధార్మిక సంస్థలకు అప్పగించాలన్న ప్రధాన డిమాండ్‌తో జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ కర్నూలు విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీ మన్నవ వేణుగోపాల్ కోరారు. ఆదివారం స్థానిక సాయిబాబా దేవాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల కన్వీనర్ శ్రీ మధుసూదన రావు,సహ కన్వీనర్ పురుషోత్తం గౌడ్, నాగేశ్వరరావు,పాల్గొన్నారు.

మహానందీశుడి సేవలో..

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధి డాక్టర్ వసుధారాణి ఆదివారం రాత్రి పూజలు నిర్వహించారు. నంద్యాలలో జరిగిన ఓ కార్యక్రమానికి వచ్చిన ఆమె మహానందీశ్వరస్వామి దర్శనార్థం క్షేత్రానికి వచ్చారు. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. అనంతరం స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ అద్భుత జలసంపదకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించేందుకు పరిశీలించాలని విజ్ఞప్తి చేయగా తగి ప్రణాళికలు రూపొందిస్తామని ఆమె తెలిపారు.



వసుధారాణిని వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు

వ్యాపార సంస్థల్లో సీసీకెమెరాలు తప్పనిసరి

నందికొట్కూరు: పట్టణంలోని వ్యాపార సంస్థలు, దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. వ్యాపార సంస్థల యజమానులు 15 రోజుల్లోగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే పోలీసుశాఖ నోటీసులు ఇచ్చిందని చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని వ్యాపారస్తులపై ప్రజా భద్రత చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం దుకాణాలను పరిశీలిస్తామన్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

పగిడ్యాల: కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో పేదలపై రూ. 18 వేల కోట్ల భారాన్ని మోపిందని.. దీనిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పకీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బస్టాండులో ఈనెల 14వ తేదీ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం శోచనీయమన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో పోలీసులు ఏకపక్షంగా పనిచేయడం విచారకరమని పేర్కొన్నారు. గంధం ఉసేనమ్మ, త్యాగరాజు, మధులత, వెంకటేశ్వర్లు, గఫార్, నాగన్న పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీ అధికారులు



సున్నిపెంటలో నివాళులర్పిస్తున్న అటవీ సిబ్బంది

బండిఆత్మకూరు: స్థానిక అటవీక్షేత్రాధికారి కార్యాలయంలో ఆదివారం అటవీ శాఖ అమరుల దినోత్సవాన్ని నిర్వహించారు. బండిఆత్మకూరు రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన అధికారులకు నివాళులర్పించి, వారి సేవలను కొనియాడారు. అధికారులు ఐకమత్యంగా పనిచేయాలని, గ్రామాల్లోని ప్రజలతో సన్నిహితంగా ఉండాలని సూచించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఆదివారం సున్నిపెంటలోని చీఫ్‌కన్జర్వేటర్ కార్యాలయంలో జరుపుకున్నారు. శ్రీశైలం–నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ చీఫ్‌కన్జర్వేటర్ బీవీఏ.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అమరులైన ఉద్యోగుల చిత్రపటాలకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా,నిబద్ధతతో అటవీ సంరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ అపావో,బయోలేబరేటరీ అసిస్టెంట్ కన్జర్వేటర్ ధనరాజ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.బషీర్ అహమ్మద్, డిప్యూటీ రేంజ్ అధికారి కె.మదన్‌మోహన్, సెక్షన్ ఆఫీసర్ ఎస్.జయరాజ్, బీట్ ఆఫీసర్లు జె.రవీంద్రనాథ్‌ఠాగూర్, పి.సలాం అల్లా, పి.శ్రీరాములు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

ఆత్మకూరురూరల్: అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర డిప్యూటీ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ సెక్షన్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరివేన గ్రామ పరిసరాల్లో ఉన్న మానవతా నిలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, ఆత్మకూరు సీహెచ్‌సీలోని బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు.ఏపీడీఎఫ్ఏ రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణ, ఎఫ్ఎస్ఓలు జి.మహేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అలగనూరు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ, ఏఐకేఎస్ నాయకులు

మిడుతూరు: మండలంలోని అలగనూరు రిజర్వాయర్ పునఃనిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయకులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అలగనూరు, చెరుకుచెర్ల, బైరాపురం, సుంకేసుల, చింతలపల్లి, ఖాజీపేట, తలముడిపి, గుడిపాడు, దేవనూరు, తిమ్మాపురం, వీపనగండ్ల తదితర గ్రామాల్లో జీపుజాత నిర్వహించారు. రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదించిన రూ. 34 కోట్లు తక్షణమే మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరారు. అలాగే మిడుతూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి 50 వేల ఎకరాల మెట్ట భూములను సస్యశ్యామలం చేయాలని అన్ని గ్రామాల్లో రైతులతో సంతకాలు సేకరించినట్లు వెల్లడించారు. రైతు సంఘం జిల్లా సమితి నాయకుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి ఫక్రుద్దీన్, నాగరాజు, పెద్దరాముడు, అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్యనారాయణ రావు



వెలుగోడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం హెగ్డే సత్యనారాయణ రావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సత్యనారాయణ రావు డీఎస్సీ 1996లో సాంఘిక శాస్త్ర సహోపాధ్యాయుడిగా ఎంపికై అనంతపురం జిల్లాలో యాడికి మండలం పి. వెంగన్నపల్లి గ్రామంలో అప్పర్ ప్రైమరీ పాఠశాలలో నియమింపబడ్డారు. 2000లో సంత జూటూరు గ్రామ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎంగా తొమ్మిది సంవత్సరాలు పనిచేశారు. 2009 నుంచి 2017 వరకు చాపిరేవుల, 2017లో జలదుర్గానికి బదిలీ అయ్యారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా, బోధన నైపుణ్యాల్లో విషయ నిష్ణాతులు కావడంతో జిల్లా స్థాయిలో జరిగే అన్ని రకాల శిక్షణ కార్యక్రమాలకు జిల్లాస్థాయి రిసోర్స్‌పర్సన్‌గా, రాష్ట్ర స్థాయి విషయ నిపుణుడిగా పనిచేశారు. విద్యార్థుల సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలు, కంటెంట్ క్రోడీకరించి పాఠ్యపుస్తక అభివృద్ధికి కృషి చేశారు. 10వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం సలభంగా అర్థమయ్యేలా స్టడీ మెటీరియల్ తయారుచేశారు. హెచ్ఎంగా పదోన్నతి పొంది ఆలమూరు, అవుకు ఆ తరువాత 2023 జూన్ 8న వెలుగోడుకు వచ్చారు. అవార్డు లభించడంపై ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వెలిబుచ్చారు.

• మమతల భోజనం



ఈ చిత్రాన్ని చూస్తే ఎక్కడో కార్తీక వనభోజనం నిర్వహించారనుకుంటే పప్పులో కాలేసినట్లే. జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలకు ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్, ఎమ్మిగనూరు, కౌతాళం, కోసిగి, బండిఆత్మకూరు, వెలుగోడు, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు వారి పిల్లలకు క్యారియర్ తీసుకొచ్చారు. ప్రేమానుబంధాలతో మమతల భోజనం తినిపిస్తుండగా 'సాక్షి' తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

–జూపాడుబంగ్లా

మనోవేదనను దిగమింగి.. అన్నదాతగా మారి!

- ప్రతి ఆదివారం యాచకులకు అన్నదానం
- కుమారుడి స్మరణలో తండ్రి వితరణ



హోటల్ ముందు భోంచేస్తున్న అభాగ్యులు,



యాచకుడికి నిండు విస్తరి అందిస్తున్న శంకరప్ప భార్య

ఆత్మకూరురూరల్: ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఆ తండ్రికి లోకం చీకటిగా మారినట్లయ్యింది. మూడేళ్ల పాటు నిత్యం కుమారుడి స్మరణతో మనోవేదన తీవ్రమైంది. ఈ వేదన తీరాలి.. కుమారుడి స్మృతికి గుర్తింపుగా ఏదో ఒక మమత్కార్యం చేయాలని తలంచాడు.. అంతే ప్రతి ఆదివారం అభాగ్యులకు అన్నదానం చేయడం ప్రారంభించాడు పట్టణానికి చెందిన సాయి మహదేవ హోటల్ యజమాని శంకరప్ప. ఇలా ఎనిమిదేళ్లుగా తన యజ్ఞం నిరాటంకంగా సాగుతోందని, అన్నార్తితో వచ్చే ఎంతమందికైనా నా కడుపునిండా భోజనం వడ్డిస్తున్నానని చెబుతున్నాడు ఆయన. ఆత్మకూరు పట్టణంలో వ్యాపారులు ఆదివారం యాచకుల కోసం కేటాయించారు. ఆ రోజు యాచకులకు దానం చేస్తారు. దీంతో ఆ రోజు ఎక్కడెక్కడి సాధువులు, భిక్షాటన చేసే వారు పట్టణంలోని షాపుల వద్ద భిక్షమెత్తుకుంటారు. ఇలా దాదాపు వంద మందికి పైగా యాచకులు కనిపిస్తారు. వీరంతా మధ్యాహ్నమయ్యే సరికి ఆర్టీసీ బస్టాండ్ వెనక ఉన్న సాయి మహదేవ హోటల్ వద్దకు చేరతారు. ఆ సమయానికి అక్కడ ఉచింతంగా తమకు కడుపునిండా అన్నం పెట్టే దాత సిద్ధంగా ఉంటాడు. హోటల్ ఎదురుగా విస్తర్లు వేసి వచ్చిన వారందరికీ అన్నం వడ్డిస్తారు శంకరప్ప. ఈయన గత 8 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం అన్నదానం చేస్తున్నారు. తన ఏకైక కుమారుడు సాయి భరత్ 11 సంవత్సరాల క్రితం బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడి స్మరణలో ఏదైన ఒక కార్యక్రమం తలపెట్టాలని భావించి యాచకులకు అన్నదానం చేయడం ప్రారంభించారు. ఇలా సుమారు వంద మందికి భోజనం వడ్డిస్తారు. అంతే కాకుండా మిగలిన రోజుల్లో ఎవరైనా తమ వద్ద డబ్బులు లేవని, ఆకలితో ఉన్నామని చెబితే వారికి కూడా ఉచితంగా అన్నం పెడతారు.

అన్నార్తుల ఆకలి తీర్చడంలో ఆత్మ తృప్తి



నా ఏకైక కుమారుడి హఠాత్ మరణం నన్ను తీవ్ర మనోవేదనకు గురి చేసింది. అల్లకల్లోలమైన మనస్సును ప్రశాంతంగా మార్చుకోవడానికి అన్నదానం ప్రారంభించాను. ఊర్లో ఆదివారం మాత్రమే యాచన కోసం వస్తారు. వారి ఆకలి తీర్చడం ద్వారా మనశ్శాంతి పొందుతున్నా. క్షుద్బాధ తీరిన వారి ముఖంలో కనిపించే తృప్తిలో నాకు నా కుమారుడు కనిపిస్తాడు.

– శంకరప్ప ,సాయిమహదేవ హోటల్ యజమాని